సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



మినీ బస్సును ఢీకొన్న ఆటో

ఆగి ఉన్న మినీ బస్సును వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో 15 మంది గాయపడ్డారు. కొండ్రుప్రోలు–బాదంపూడి మధ్య ప్రమాదం జరిగింది. 8లో ▸



అథ్లెటిక్స్ విజేతలు వీరే

కైకరం హైస్కూల్‌లో స్కూల్‌గేమ్స్ అండర్–14 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కడప జిల్లా దక్కించుకుంది. 8లో ▸



'కోడ్' కూసింది

శాసనమండలిలో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రాథమిక స్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు. 8లో ▸

న్యూస్‌రీల్

సీపీసీ అధ్యక్షుడి ఓటింగ్‌లో మోషేన్‌రాజు



ఓటింగ్‌లో పాల్గొన్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం(ప్రకాశం చౌక్): ఆస్ట్రేలియాలోని సిడ్నీలో గురువారం జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ (సీపీసీ) అధ్యక్షుని ఎన్నికల ఓటింగ్‌లో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో జాంబియాకి చెందిన ఈట క్రిస్టోఫర్ కలిలాను సీపీసీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

సమీప రీచ్‌ల నుంచి ఇసుక

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో వినియోగదారులు రీచ్‌ల నుంచి ఇసుక పొందవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్‌లోని తీపర్రు 2,3, ఔరంగాబాద్ రీచ్ నుంచి ఉచిత ఇసుక పొందేందుకు వీలుందన్నారు. ఇసుక రవాణాలో అక్రమాలకు పాల్పడితే సహించమని హెచ్చరించారు.

10న మన్యసీమ దర్శిని యాత్ర



సత్యనారాయణమూర్తి డిపో మేనేజర్

భీమవరం(ప్రకాశం చౌక్): వినోద, విజ్ఞానాలతో పాటు మానసికోల్లాసం కలిగించే మన్యసీమ దర్శిని బస్సు సర్వీసును ఈ నెల 10 నుంచి ప్రారంభిస్తున్నామని భీమవరం డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 4 గంటలకు బస్సు బయలుదేరుతుందని, కోరుకొండ, సీతపల్లి, మారేడుమిల్లి, పాములేరు వాగు దర్శించి తిరుగు ప్రయాణంలో రాజమండ్రి ఇస్కాన్ టెంపుల్, పుష్కరాల రేవు మీదుగా రాత్రి 10 గంటలకు భీమవరం చేరుకుంటుందన్నారు. చార్జీలు ఎక్స్‌ప్రెస్‌కు రూ.600, అల్ట్రా డీలక్స్ రూ.700లు నిర్ణయించామన్నారు. వివరాలకు సెల్ 73829 24754, 08816–239100, 96660 89036 సంప్రదించాలని కోరారు. అలాగే ప్రతి ఆదివారం రాత్రి పంచారామదర్శిని ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నామన్నారు. శబరిమలై, శ్రీశైలం యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులను ఏర్పాటుచేస్తామన్నారు. అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలపై అవగాహన

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో గురువారం సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ)పై పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మంగపతి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల సామర్థ్యం, ఉత్పాదకత, కొత్త తరహా టెక్నాలజీ ఉపయోగించి పరిశ్రమను మెరుగుపరుచుకోవాలన్నారు. నాణ్యత పెంచుకునేలా సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎంఎస్‌ఎంఈల సబ్సిడీలను పొందడానికి గొప్ప అవకాశం ఉందని ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కో–ఆర్డినేటర్ నల్లగొండ్ల గాంధీ అన్నారు. పరిశ్రమల నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు శుక్రవారం నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని జెడ్పీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు. స్థాయీ సంఘం వారీగా జిల్లా అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. అలాగే జెడ్పీ పరిపాలనకు సంబంధించి అజెండా అంశాల ఆమోదం ఉంటుందన్నారు.

అర్హులందరికీ దీపం-2

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో అర్హులందరికీ ఉచిత గ్యాసు సిలిండర్ల సరఫరా పథకం (దీపం–2) అమలుకు చర్యలు తీసుకున్నామని డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5,67,651 బియ్యం కార్డుదారులకు గాను ఇప్పటివరకూ 4,52,394 కార్డుదారులను అర్హులుగా గుర్తించామన్నారు. మిగిలిన వారు ఈకేవైసీ పూర్తిచేసుకోవాల్సి ఉందన్నారు. సిలిండర్ డెలివరీ బాయ్స్ వినియోగదారుల ఇంటికే వచ్చి ఈకేవైసీ చేయించుకుంటారన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ ఉచిత సిలిండరు కోసం బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులు 1,03,325 మంది ఉన్నారన్నారు. సమస్యలు, సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్లు 1967, 1800 425 1291కి ఫోన్ చేయవచ్చన్నారు.

బాబోయ్.. ఇవేం జ్వరాలు!

వైరల్ ఫీవర్రీ

- జిల్లాకు జ్వరమొచ్చింది
- మళ్లీ మళ్లీ వస్తోంది.. ఇంటిల్లిపాదినీ చుట్టేస్తోంది
- అధిక ఉష్ణోగ్రతలు, ఒళ్లు నొప్పులు
- నవంబర్ వచ్చినా నమోదవుతున్న కేసులు
- మునుపెన్నడూ లేవంటున్న వైద్యులు
- వాతావరణ మార్పులు కారణమని అభిప్రాయం
- నామమాత్రంగా పారిశుధ్య నిర్వహణ, దోమల నిర్మూలన

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన కేసులు

నెల	మలేరియా	డెంగీ	వైరల్ ఫీవర్	నెల	మలేరియా	డెంగీ	వైరల్ ఫీవర్
జూలై	19	10	245	సెప్టెంబరు	20	28	3,668
ఆగస్టు	99	64	2,870	అక్టోబరు	0	17	2,658



ప్రభుత్వ ఆస్పత్రిలో జ్వరపీడితులు

సాక్షి, భీమవరం: జిల్లావాసులను విషజ్వరాలు వణికిస్తున్నాయి. తగ్గినట్టే తగ్గి మళ్లీ తిరగబెడుతున్నాయి. ఒకరికి వస్తే చాలు ఇంటిల్లిపాదినీ చుట్టేస్తున్నాయి. ముందెన్నడూ లేని లక్షణాలతో వైద్యులకు అంతుచిక్కకుండా ఉంటున్నాయి. సీజన్ మారినా కొత్త కేసులు నమోదవుతుండగా అధిక వర్షాలే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీజన్ మార్పు, వర్షాలతో సాధారణంగా జూలై నుంచి అక్టోబరు మొదటి వారం వరకు విషజ్వరాలు ప్రబలి తర్వాత తగ్గుముఖం పడుతుంటాయి. ఈసారి నవంబరు వచ్చినా జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులకు తోడు చెత్త తరలింపు సరిగా జరగక పారిశుధ్య లేమి పరిస్థితులు, దోమల విజృంభణ ప్రజలను జ్వరపీడితులను చేస్తున్నాయి.

ఎక్కడ చూసినా ఫీవర్ ఫియర్

పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా ఎక్కడ చూసినా టైఫాయిడ్, మలేరియా, డెంగీ తదితర వైరల్ ఫీవర్ల బాధితులు ఉంటున్నారు. గత నాలుగు నెలల్లో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 9,699 జ్వరాల కేసులు నమోదు కాగా ప్రైవేట్ ఆస్పత్రులు, పీఎంపీలను ఆశ్రయించిన వారి సంఖ్యకు లెక్కేలేదు. వైద్య గణాంకాల ప్రకారం ఈ సీజన్‌లో జూలై నుంచి అక్టోబరు నెలాఖరు నాటికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో 139 మలేరియా కేసులు నమోదు కాగా 119 డెంగీ కేసులు, 9,441 వైరల్ ఫీవర్ కేసులు వచ్చాయి. వీరిలో డెంగీ బారిన పడిన ఐదేళ్లలోపు చిన్నారులు ఏడుగురు ఉండగా, వైరల్ ఫీవర్ బారిన పడిన వారు 1,045 మంది ఉన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి : జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు గోరువెచ్చని నీటిని తాగడం, ఆహారం వేడిగా ఉన్నప్పుడే భుజించడం, ఆహార పదార్థాలపై మూతలు పెట్టడం, విధిగా మాస్కు ధరించుకుని బయటకు వెళ్లడం తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్య ఖర్చులు తడిసిమోపెడు : విషజ్వరాలు ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. వైద్యం పేరిట రోగుల నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో బిల్లులు వసూలు చేస్తూ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు చుక్కలు చూపిస్తున్నాయి. కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) టెస్టుకు రూ.300, ఎంపీకు రూ.400, వైడల్‌కు రూ.200లతో పాటు లిపిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షన్ పేరిట రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే డెంగీ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌ల్లోనూ డెంగీ టెస్టుల పేరిట ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నారు.

అంతుచిక్కని లక్షణాలు



జ్వరపీడితులు చలి జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పితో బాధపడి నాలుగైదు రోజుల తర్వాత కోలుకుని సాధారణ స్థితికి వస్తుంటారు. అయితే ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. 101 డిగ్రీలు దాటి టెంపరేచర్లు నమోదవుతున్నాయి. టాబ్లెట్లు, ఇంజక్షన్లకు టెంపరేచర్ తగ్గినట్టు అనిపించినా కొద్దిసేపటికే శరీరం వేడెక్కిపోవడం కనిపిస్తోంది. వైరల్ జ్వరాల్లో ప్లేట్‌లెట్స్ కౌంట్ పడిపోతుండటం కలవరపెడుతోంది. ఇంట్లో జ్వరపీడితులు ఉంటే రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికీ జ్వరం సోకుతోంది. నాలుగైదు రోజులు కోర్సు వాడిన తర్వాత తగ్గినట్టే తగ్గి కొద్దిరోజుల తర్వాత మళ్లీ తిరగబెడుతోంది. మునుపెన్నడూ లేని విధంగా జ్వరం తగ్గినా కీళ్ల నొప్పులు, మడం నొప్పులు, ఒంటి నొప్పులు, కళ్లు, ముఖం ఉబ్బిపోవడం, చర్మంపై దద్దర్లు రావడం, రంగు మారిపోవడం, మచ్చలు పడటం తదితర సమస్యలు వైద్యవర్గాలకు అంతుచిక్కడం లేదు. ఈ ఏడాది తరచూ భారీ వర్షాలు కురవడం, వరదలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఈ తరహా వైరల్ జ్వరాల వ్యాప్తికి కారణం కావచ్చని వైద్యవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

అధిక టెంపరేచర్‌తో జ్వరం



జ్వరపీడితుల్లో బాడీ టెంపరేచర్ ఎక్కువగా ఉంటోంది. జ్వరం తగ్గాక విపరీతమైన ఒంటి నొప్పులు ఉంటున్నాయి. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పిల్లలకు, పెద్దలకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశాం. కొన్ని రోజుల ఇబ్బంది తప్పితే ప్రాణాపాయం ఏమీ లేదు. ఆస్పత్రిలో జ్వరాలు, ఇతర రోగాలకు సంబంధించిన వైద్యపరీక్షలు ఉచితంగానే అందుబాటులో ఉన్నాయి. జ్వరాలు బారిన పడకుండా ఉండేందుకు వ్యక్తిగత శుభ్రతతో పాటు మంచి ఆహార అలవాట్లు, బయటకు వస్తే తప్పనిసరిగా మాస్క్ ధరించాలి.

– డాక్టర్ వెలగల అరుణ, జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్, తణుకు

రెండు నెలల్లో మూడుసార్లు..



మా పాపకు రెండు నెలల్లో మూడుసార్లు జ్వరం వచ్చింది. ఒక్కోసారి ఒళ్లంతా చాలా వేడిగా ఉంటోంది. రక్తంలో ఇన్ఫెక్షన్ రావడంతో నాలుగు రోజులుగా ఆస్పత్రిలో ఉంచి వైద్యం చేయిస్తున్నాం.

– బి.బుజ్జి, చీపురుగూడెం

మా గ్రామంలో చాలా మందికి..



మా గ్రామంలో చాలామంది అంతుచిక్కని జ్వరాలతో బాధపడ్డాం. రెండు నెలల్లో నాకు పలుమార్లు తీవ్ర జ్వరం వచ్చింది. జ్వరం తగ్గాక నీరసం, ఒళ్లు, కీళ్ల నొప్పులు, కాళ్ల వాపు వచ్చాయి. ముఖం రంగుమారిపోయింది. ఎన్ని మందులు వాడినా రెండు నెలలు వరకూ తగ్గలేదు.

– కొట్టు నాగరాజు, ఉప సర్పంచ్, దువ్వగడప

ముందు జాగ్రత్తలతో క్యాన్సర్ నుంచి రక్షణ

కలెక్టర్ నాగరాణి



భీమవరంలో జెండా ఊపి క్యాన్సర్ అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): ముందుగా జాగ్రత్త పడితే క్యాన్సర్ బారి నుంచి రక్షణ పొందవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ నుంచి అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవగాహన లోపంతో చాలామంది క్యాన్సర్ తీవ్రత ఎక్కువయ్యే వరకూ తెలుసుకోలేకపోతున్నారన్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లను ప్రాథమిక దశలో గుర్తిస్తే సకాలంలో నయం చేయవచ్చన్నారు. క్యాన్సర్ సోకినా భయపడకుండా చికిత్స చేయించుకోవాలన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ కీర్తి, ఆర్‌బీఎస్‌కే పీఓ సీహెచ్ భావన, డీపీఎంఓ ఇన్‌చార్జి గులాబ్ రాజ్‌కుమార్, విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం : పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంచుకోవాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు పట్టణంలోని గ్రంథాలయంలో వారోత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు, ర్యాలీలు, మహిళా సదస్సు వంటివి నిర్వహిస్తామన్నారు. కంతేటి వెంకటరాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన ఐటీ సోదాలు

ఏలూరు, భీమవరంలో తనిఖీలు



ఏలూరులో నూకల రామకృష్ణ ఇంటి వద్ద సోదాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో కేంద్ర ఆదాయపు పన్ను శాఖ అధికారులు రెండో రోజు సోదాలు కొనసాగించారు. నగరానికి చెందిన ఆయిల్‌ఫెడ్ వ్యాపారి నూకల రామకృష్ణ ఇల్లు, కంపెనీ కార్యాలయాల్లో ఆదాయపు పన్ను అధికారులు తనిఖీలు చేపట్టారు. చెన్నై నుంచి వచ్చిన అధికారుల బృందం గురువారం కూడా తనిఖీలు కొనసాగించారు. ఈ తనిఖీలు అర్ధరాత్రి వరకు కొనసాగుతాయని, శుక్రవారం కూడా సోదాలు జరిగే అవకాశం ఉందని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్‌ఫెడ్ కంపెనీలకు సంబంధించి వ్యాపారాలు చేస్తున్న వారిపై దాడులు చేస్తున్నట్టు సమాచారం. ఏలూరులోని రామకృష్ణ కార్యాలయంలో రాత్రి వరకూ ఆదాయపు పన్ను వివరాలు, రికార్డులను తనిఖీ చేస్తున్నట్టు తెలుస్తోంది.

భీమవరం మాజీ ఎమ్మెల్యే నివాసంలో..

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో రెండో రోజు కూడా ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు కొనసాగించారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు సోదాలు నిర్వహించారు. అనంతరం గురువారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. గురువారం గ్రంధి శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులు నివాసంలో ఉన్నారు. వారితో ఐటీ అధికారులు మాట్లాడుతున్నారు. పట్టణంలో ఏడు చోట్ల ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రొయ్యల వ్యాపారుల ఇళ్లు, సంస్థల్లో సోదాలు చేశారని, శుక్రవారం కూడా భీమవరంలో పలుచోట్ల ఐటీ అధికారులు సోదాలు నిర్వహించనున్నారని సమాచారం.

శిశువుల ఆరోగ్యంపై జాగ్రత్త తప్పనిసరి



ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): పసిబిడ్డల ఆరోగ్యంపై అత్యంత జాగ్రత్త వహించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో గురువారం గర్భస్థ శిశు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆయన సందర్శించారు. శిశువులకు అందుతున్న వైద్య సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. పసిబిడ్డల ఆరోగ్య విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని, ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలని మహిళలకు సూచించారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు నోటిఫికేషన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు నోటిఫికేషన్‌ను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసిందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి వచ్చేనెల 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చేనెల 18 నుంచి 23 వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

కొల్లేరులో చెరువు దుమారం

కూటమిలో కుంపట్లు

- అక్రమ సాగుపై ఆధిపత్య పోరు
- లీజుదారులకు గండికొడుతున్న ఎమ్మెల్యే చింతమనేని
- కొల్లేరులో 22 వేల ఎకరాల్లో అక్రమ సాగు
- జనసేన, టీడీపీ మధ్య ముదురుతున్న రాజకీయ వివాదం
- 60 ఎకరాల్లో చెరువులను అడ్డుకున్న టీడీపీ
- దెందులూరులో ఘర్షణ వాతావరణంలో కూటమి పార్టీలు
- కొల్లేరులో జనసేన నేతలను అడ్డుకున్న మొండికోడు గ్రామస్తులు



ఏలూరు రూరల్ మండలం మొండికోడులో చేపల చెరువు గట్టు వద్ద ఉద్రిక్తత (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కొల్లేరులో సాగు చేసేది అక్రమం. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అభయారణ్యంలో చేపల సాగు అనేది నిషేధం. అయినా 50, 100 ఎకరాలు కాదు వేల ఎకరాల్లో అక్రమ సాగు అనాదిగా జరుగుతూనే ఉంది. ఇలాంటి అక్రమ సాగులో కూటమి పార్టీ నేతలు టీడీపీ, జనసేన మధ్య చెరువుల విషయంలో ఆధిపత్యపోరు తారాస్థాయికి చేరడంతో కొల్లేరులో రాజకీయ దుమారం రేగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి టీడీపీ దూకుడుగా వ్యవహరించి లీజుదారుల ప్రయోజనాలకు బహిరంగంగానే గండికొట్టడం చర్చగా మారింది. ఇటీవల ఏలూరు రూరల్ మండలంలోని మొండికోడు గ్రామంలో చెరువులను పరిశీలించడానికి వెళ్లిన జనసేన నేతలను గ్రామస్తులు అడ్డుకోవడంతో వివాదానికి దారి తీసింది.

కూటమిలో రచ్చ : కొల్లేరు అక్రమ చెరువుల వ్యవహారం దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, దెందులూరు జనసేన ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి మధ్య తీవ్ర ఆధిపత్య పోరుకు దారితీసింది. వాస్తవానికి కొల్లేరులో అక్రమ చెరువులు నిషేధం అనేది కాగితాలకే పరిమితం. ఏలూరు జిల్లాలో 9 మండలాలు 122 గ్రామాల పరిధిలో కొల్లేరు అభయారణ్యం 77,138 ఎకరాల్లో విస్తరించి ఉంది. 5వ కాంటూరు వరకు అభయారణ్యంగా గుర్తించి 1999లో అక్టోబర్ 4న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అభయారణ్యంలో చేపల సాగుపై నిషేధం విధించింది. తదనంతర క్రమంలో 2005–06లో సుప్రీంకోర్టు ఉత్తర్వులతో కొల్లేరు ఆపరేషన్ జరిగింది. దీనిలో 43 వేల ఎకరాల విస్తీర్ణంలో 17,271 ఎకరాల్లో అక్రమ చెరువులు ధ్వంసం చేసి సొసైటీలకు లీజు చెరువులు అన్నింటినీ రద్దు చేసి అటవీశాఖ పూర్తిస్థాయిలో పర్యవేక్షించేలా చేశారు. అయితే కొల్లేరు ఆపరేషన్ అనంతరం కొంత కాలానికి ధ్వంసమైన చెరువులే కాకుండా కొన్ని వేల ఎకరాలు కలుపుకుని సుమారు 22 వేల ఎకరాల్లో చెరువులు సాగు చేశారు.

చెరువులను సీజ్ చేసి.. రొయ్యలను విక్రయించి..

పైడిచింతపాడు గ్రామంలో 40 ఎకరాల చెరువును గ్రామ సర్పంచ్, జనసేన నేత లీజుకు తీసుకున్నారు. 40 ఎకరాల్లో రొయ్యలు సాగు చేయగా టీడీపీ నేతలు చివరి వరకు చూసి రొయ్యలు పట్టే సమయానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాలతో అటవీశాఖాధికారులు అక్రమ సాగు అని చెప్పి చెరువును సీజ్ చేసి రొయ్యలను వేలం ద్వారా విక్రయించారు. దీంతో జనసేన నేతకు సుమారు రూ.30 లక్షల నష్టం వాటిల్లింది. ఇదే క్రమంలో మరో జనసేన నేత మొండికోడు గ్రామంలో 20 ఎకరాల చెరువును సాగు చేసి గత మంగళవారం చేపలు పట్టే సమయంలో టీడీపీ నేతల ప్రద్బోలంతో గ్రామస్తులు తిరగబడి జనసేన ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, లీజ్‌దారుడు, జనసేన నేతతో వాదనకు దిగారు. అటవీ శాఖాధికారులు యథావిధిగా చెరువులు స్వాధీనం చేసుకున్నారు. ఘర్షణ నేపథ్యంలో మేత లేక సుమారు రూ.30 లక్షల మేర చేపలు చనిపోయాయి. ఇదే తరహాలో మరికొన్ని చెరువులు ఏలూరు రూరల్ మండలంలో ఉండటంతో ఏం జరుగుతుందోనని సర్వత్రా చర్చగా మారింది. ఇప్పటికే జనసేన, టీడీపీ నేతలు పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినా రెండు పార్టీలు సీరియస్‌గా తీసుకోకపోవడం, ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ వద్ద పంచాయితీ పెట్టినా రెండు వర్గాలు వెనక్కి తగ్గకపోవడం చర్చనీయాంశంగా మారింది.

గ్రామ లీజులు ఎలా అంటే..

కొల్లేరు ఆపరేషన్‌కు ముందు గ్రామాల్లో సొసైటీలు ఉండేవి. ఉదాహరణకు ఒక గ్రామ శివారులో 500 ఎకరాలు కొల్లేరు అభయారణ్యం ఉంటే గ్రామంలో ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని కుటుంబాలకు 500 ఎకరాల ఉమ్మడి సాగు చేసి ఫలసాయంలో కొల్లేరు పెద్ద నేతృత్వంలో ఏటా డబ్బులు చెల్లించేవారు. గతంలో గ్రామస్తులే నిర్వహించేవారు. రాజకీయ జోక్యం మితిమీరడంతో 90 శాతానికిపైగా చెరువులు గ్రామస్తులు కాకుండా లీజుదారులకు అప్పగిస్తున్నారు. ఈక్రమంలో లీజుదారు ఎకరాకు సగటున రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్‌ను బట్టి ఏటా కౌలు చెల్లిస్తుంటారు.

క్లుప్తంగా

కూర్మావతారంలో 'కంద'



కూరగాయల దుకాణంలో తాబేలు ఆకారంలో కంద దుంప

కామవరపుకోట : కూరగాయల దుకాణంలో కంద దుంప తాబేలు ఆకారంలో దర్శనం ఇచ్చింది. దానిని పలువురు ఆసక్తిగా తిలకించారు. మామూలుగా అయితే కందదుంప సరైన ఆకారం లేకుండా కేజీ నుంచి 2 కేజీల వరకు ఉంటుంది. కానీ స్థానిక కొత్తూరులో గల ఓ కూరగాయల దుకాణంలో దర్శనమిచ్చిన కంద దుంప మాత్రం తాబేలు ఆకారం కలిగి నాలుగు కాళ్లు, ఒకతల, వీపుపై భాగంలో శ్రీ చక్రం ఆకారం కలిగినట్లుగా పోలి ఉండడం విశేషం.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



సుభాష్‌ను అభినందిస్తున్న కోచ్ సీతారామయ్య

తణుకు అర్బన్: రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నిర్వహించిన టెన్ కేఎం క్రాస్ కంట్రీలో తణుకు క్రీడాకారుడు బి.సుభాష్ ప్రథమ బహుమతి సాధించాడు. తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న సుభాష్ ఈనెల 4వ తేదీన జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఆల్ ఇండియా నేషనల్ పోటీలకు ఎంపికైనట్లు తణుకు కీర్తిశ్రీ స్పోర్ట్స్ కోచ్ కట్లపర్తి సీతారామయ్య తెలిపారు. క్రీడాకారుడిని కోచ్‌తోపాటు పలువురు ప్రముఖులు, క్రీడాకారులు అభినందించారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక




విద్యార్థినులను అభినందిస్తున్న మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ ప్రకాశరావు

తణుకు అర్బన్: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు రాష్ట్రం తరపున పాల్గొనే జట్టులో తణుకు మాంటిస్సోరి స్కూలు విద్యార్థులు అర్హత సాధించారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు పార్వతీపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్ 14 కంపౌండ్ బాలికల విభాగంలో మాంటిస్సోరి స్కూలు 6వ తరగతి విద్యార్థిని కె.రీనా సమీక్షారెడ్డి 2వ స్థానంతో వెండి పతకం, అండర్ 19 రికర్వ్ బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని ఎస్.హంసిని 3వ స్థానంలో నిలిచి రజిత పతకం సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. దీంతో విద్యార్థులు ఈనెల 10 నుంచి గుజరాత్‌లోని నడియాడ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టులో పాల్గొంటారని వివరించారు. విద్యార్థినులు, కోచ్ ఎస్.సోమశేఖర్‌ను డైరెక్టర్ ప్రకాశరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

గోదావరిలో కోడ్ కూసింది

- మొదలైన మండలి ఎన్నికల వేడి
- ఏర్పాట్లలో యంత్రాంగం బిజీబిజీ
- 11న టీచర్ ఎమ్మెల్సీ నోటిఫికేషన్
- డిసెంబరు 5న పోలింగ్, 9న లెక్కింపు
- 113 మండలాల్లో 16,316 మంది ఓటర్లు
- 23 వరకు పట్టభద్రుల ఓట్ల నమోదు
- ఆర్వోగా కాకినాడ కలెక్టర్ షణ్మోహన్



సాక్షి ప్రతినిధి, కాకినాడ: పెద్దల సభలో అడుగుపెట్టే ఇద్దరు ప్రతినిధుల కోసం ఎన్నికల పోరు ఊపందుకుంది. మండలిలో ఖాళీ అయిన పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రాథమిక స్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికకు ఓటర్ల నమోదు కూడా పూర్తయ్యింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన ఓట్లు నమోదు ప్రక్రియ వాస్తవానికి బుధవారంతో ముగిసినప్పటికీ ఈ నెల 23 వరకూ నమోదుకు అవకాశం కల్పించారు. ఈ విషయాన్ని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమితులైన కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి బుధవారం కాకినాడలో విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రజాప్రతినిధులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ...

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. ఆ రోజు నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 19న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్లు ఉపసంహరణ ఉంటుంది. డిసెంబరు 5వ తేదీన పోలింగ్, 9న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ ఎన్నికలకు కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల రెవెన్యూ అధికారులు వ్యవహరించనున్నారు.
- ఉమ్మడి తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లాల్లో 113 మండలాల పరిధిలో ఉన్న ఓటర్లు 16,316 మంది. ఇందులో పురుషులు 9,674 మంది కాగా, స్త్రీలు 6,642 మంది ఉన్నారు. వీరి కోసం 116 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. 11 మండలాల్లో ఉన్న ఈ ఓటర్ల కోసం 12 పోలింగ్ కేంద్రాలు ఎంపిక చేశారు.
- తూర్పు గోదావరి జిల్లాలో 19 మండలాల్లో 2,893 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో 20 మండలాల్లో ఉన్న 2605 మంది ఓటర్ల కోసం 20 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. కాకినాడ జిల్లాలో 21 మండలాల్లోని 3,333 మంది ఓటర్ల కోసం 22 పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి.
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాలలో 3,209 మంది ఓటర్ల కోసం 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 20 మండలాల్లో 3,662 మంది ఓటర్ల కోసం 20 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు.
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం కోర్టు హాలులో నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి తుది ఓటర్ల జాబితా ఇప్పటికే ప్రచురించారు. ఈ జాబితాలను జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్, ఎంఈఓ కార్యాలయాలతో పాటు పోలింగ్‌స్టేషన్‌లో హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీ అందుబాటులో ఉంచారు.
- ఉమ్మడి తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల ఆరో తేదీ(బుధవారం) వరకు అవకాశం ఇచ్చారు. ఆరో తేదీ వరకు నమోదు చేసుకున్న వారి ఓటర్ల జాబితా ఈ నెల 23న ప్రచురించే డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ఉంటాయి. ఈ నెల ఏడో తేదీ గురువారం నుంచి 23వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లు డిసెంబర్ 30న ప్రచురించే తుది పబ్లికేషన్‌లో ప్రచురిస్తారు. ఇంతవరకూ ఓటు నమోదు చేసుకోని వారు ఈ నెల 23 వరకు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

ఎవరు అర్హులంటే..

ఈ నెల ఒకటో తేదీ నాటికి మూడేళ్ల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు. 15 ఏళ్లు స్టడీ పూర్తి చేసి ఉండాలి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటి వరకు లక్షా 74 వేల 772 మంది ఓటర్లు నమోదయ్యారని నిర్ధారించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 61, ఏలూరు జిల్లాలో 45, కాకినాడ జిల్లాలో 63 పోలింగ్ కేంద్రాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 53, పశ్చిమ గోదావరి జిల్లాలో 65 పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. మొత్తంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 299 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వచ్చే మార్చి నెలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది.

అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ముందుగా ఎన్నికలు జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను ఇప్పటికే ప్రకటించాం. పోలింగ్‌కు సంబంధించి ప్రాథమిక స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ఆయా జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఎన్నికలను పర్యవేక్షిస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పోలింగ్ స్టేషన్లను కూడా గుర్తించి సిద్ధం చేశాం.

– షణ్మోహన్ సగిలి, రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్

ఆగిన మినీ బస్సును ఢీకొన్న ఆటో

ఆటోలోని 15 మంది కూలీలకు గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: ఆగి ఉన్న మినీ బస్సును వెనుక నుంచి ఆటో ఢీకొన్న సంఘటన తాడేపల్లిగూడెం మండలంలోని కొండ్రుప్రోలు– బాదంపూడి గ్రామాల మధ్య గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 15 మంది గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. భీమడోలు నుంచి దువ్వ రొయ్యల ఫ్యాక్టరీకి వెళ్లేందుకు 15 మంది కూలీలు ఆటోలో గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకు బయల్దేరారు. ఉదయం 5.30 గంటల ప్రాంతంలో తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు సమీపానికి చేరుకునే సరికి రోడ్డుపై ఆగి ఉన్న మినీ బస్సును ఆటో ఢీకొంది. దీంతో పి.అనసూయ, తుమ్మగుంట మౌనిక, బత్తుల ప్రభావతి, బొత్స కుసుమకుమారి, కర్రి మల్లేశ్వరి, పి.నాగమణి, శింగవరపు శేషవేణి, దివ్య, నాగలక్ష్మి, నెరుసు విజయకుమారి, జంగం దేవమాత, బాగాపరపు ధనలక్ష్మి, వేమూరి పద్మ, సీహెచ్.సుగుణ, రంగమ్మలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరిని విజయవాడ తరలించగా, మరో ఇద్దరిని ఏలూరు ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం పంపించారు. ఆటో డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. వి.పద్మ ఫిర్యాదు మేరకు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై జేఎస్‌వీ. ప్రసాద్ తెలిపారు.



తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు సమీపంలో జాతీయ రహదారిపై మినీ బస్సును ఢీకొన్న ఆటో

ఉలిక్కిపడిన భీమడోలు

భీమడోలు: ఆటో ప్రమాదానికి గురైన ఘటనతో భీమడోలు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ప్రమాద వార్త అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి తరలివెళ్లారు. మహిళా కూలీలంతా భీమడోలు, వడ్లపట్లకు చెందిన వారే. భీమడోలులోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పత్తివాడ అనూకు రెండు కాళ్లు మూడు చోట్ల విరిగాయి. ఆమెకు భర్త లేడు. ఇద్దరు పిల్లలు. రెక్కాడితే గాని డొక్కాడని ఆమె గత రెండు నెలలుగా రొయ్య ఫ్యాక్టరీకి పనుల నిమిత్తం వెళ్తుంది. అక్కడ నుంచి వచ్చి సాయంత్రం పలు ఇండ్లలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి దయనీయంగా మారింది. అలాగే ఆ కుటుంబంలోని బొత్స కుసుమకుమారికి, ఆమె తల్లి కర్రిమెరకల వెంకట రంగ ప్రభకు తీవ్ర గాయాయల్యాయి. తుమ్మగుంట మౌనిక సైతం తీవ్రంగా గాయపడింది.

టైర్ పంక్చర్‌తో ఆటో బోల్తా

సిద్ధార్థనగర్ వద్ద ఏడుగురికి గాయాలు

నూజివీడు: కూలీలతో వెళ్తుండగా టైర్ పంక్చర్ కావడంతో ఆటో బోల్తా పడిన ఘటన నూజివీడు మండలంలోని సిద్ధార్థనగర్ సమీపంలో గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. నూజివీడు మండలం అన్నవరంనకు చెందిన 10 మంది కూలీలు, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం నాగులూరుకు మినపతీత నిమిత్తం ఆటోలో వెళ్తున్నారు. సిద్ధార్థనగర్ వద్దకు వెళ్లే సరికి టైర్ పంక్చర్ అయ్యి ఆటో పక్కకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జీ నాగమల్లేశ్వరి(40), కే రమణ(41), ఎం జమలయమ్మ(60), ఎస్ గంగారత్నం(50), ఎస్ చిన్ని(35), కే రజనీ(30), ఎస్ రాజ్యలక్ష్మి(25)లకు గాయాలయ్యాయి. దీంతో వెంటనే క్షతగాత్రులను స్థానికులు వేరే ఆటోల్లో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నూజివీడు మండలం సిద్ధార్థనగర్ వద్ద బోల్తా పడిన ఆటో

అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలు వీరే

ఉంగుటూరు : కైకరం జెడ్పీ హైస్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న స్కూల్‌గేమ్స్ అండర్ 14 బాల, బాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు గురువారం ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కడప జిల్లా దక్కించుకోగా బాలురు వ్యక్తిగత చాంపియన్‌షిప్ కడప, బాలికల వ్యక్తిగత చాంపియన్‌షిప్ అనంతపురంనకు దక్కింది. ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు అధ్యక్షతన అతిథులు విజేతలకు బహుమతులు అందజేశారు. పరిశీలకులు పీవీ ప్రసాదరెడ్డి, జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.నాగసుధ, ఎస్ఎంసీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి, వైస్ చైర్మన్ ఎస్. బలరామ పాల్గొన్నారు.



జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


విజేతల వివరాలు

బాలురు విభాగంలో 400 మీటర్ల పరుగులో కడపకు చెందిన ఎస్ అశ్వనికుమార్, పెంచల్‌బాబు, రాఘవేంద్ర, సాయిపుష్, ప్రథమ స్థానం సాధించగా అనంతపురం జిల్లాకు చెందిన సాయికృష్ణ, బి.రవితేజ, బి.నవీన్, టి.దీలిప్ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికలు 600 మీటర్ల పరుగులో అనంతపురంనకు చెందిన ఎ.వర్షిత, కడపకు చెందిన జి.కావ్య, నెల్లూరుకు చెందిన కృప ప్రినే, డి.ఇందు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో 400 మీటర్లలో కడపకు చెందిన సి.నిత్యభావన, ఎం.లక్ష్మి, జి.కావ్య, డి.జాషవిత ప్రథమ స్థానం సాధించారు. నెల్లూరుకు చెందిన సీహెచ్ కృప ప్రిన్సి, పి.భావన, పి.వెంకట పవిత్ర, ఎస్‌కే.సీమ, ద్వితీయస్థానం సాధించారు. 200 మీటర్ల పరుగులో బాలుర విభాగంలో కె.రాఘవేంద్ర, (కడప), ఎస్ అశ్వనికుమార్ (కడప), పి.దిలీప్‌కుమార్ (శ్రీకాకుళం), డి.సాయి నితీస్ నాయక్ (కర్నూలు), 200 మీటర్ల బాలికల విభాగంలో సి. నిత్యభావన (కడప) బి.షార్మి (చిత్తూరు), ఎం.హారిక (శ్రీకాకుళం), పి.హసిని (గుంటూరు) గెలిచారు. బాలురు 600 మీటర్ల పరుగులో ఎం.పెంచలబాబు (కడప), ఎస్.మౌలాలి (అనంతపురం), పి.గణేష (విశాఖ), ఎ.నాగభవాని ఈశ్వర్ (కడప) విజయం సాధించారు. 80 మీటర్ల బాలుర విభాగంలో ఎం.పెంచలబాబు (కడప), ఎం.సాయి పుష్, (కడప), డి.గణ రమేష్ (గుంటూరు), బాలికల విభాగంలో పీవీ సాయి చైతన్యశ్రీ (గుంటూరు), ఎస్‌కే మహీమ్ (నెల్లూరు), డి.జస్విత (కడప) గెలుపొందారు. డిస్కస్‌త్రో బాలికల విభాగంలో టి.నిఖిత (చిత్తూరు), డీవీ జ్యోతి (ప్రకాశం), వి.కోమల ప్రియ (కడప), ఎం.శ్రీజ (అనంతపూర్), హైజంప్ బాలుర విభాగంలో వి.రాఘవేంద్ర (విజయనగరం), డి.రహీమ్ (ప్రకాశం), కె.రాఘవేంద్ర (కడప), ఎస్ సాయి పుష్పేష్ (కడప) గెలుపొందారు. 100 మీటర్ల పరుగులో బాలికల విభాగంలో డి.షర్మి (చిత్తూరు), ఎం.హారిక (శ్రీకాకుళం), ఇ.హసిని (చిత్తూరు), పి.నిత్యబాను (కడప) విజేతలుగా నిలిచారు. 400 మీటర్ల పరుగులో ఎ.వర్షిత (నర్సపురం), కావ్య (కడప), ఎం.లక్ష్మి (కడప), సీహెచ్ కృపాప్రిన్సి (నాయుడు పేట), ఆర్ పవిత్ర (శ్రీకాకుళం) గెలుపొందారు. బాలుర విభాగంలో ఎస్ మోలాలి (అనంతపురం,) టి.గణేష్ (అరకు), ఎ. నాగభవాని ఈశ్వర (కడప), కె.వెంకటనర్సయ్య (గుంటూరు) గెలుపొందారు. 100 మీటర్ల బాలుర విభాగంలో కె.రాఘవేంద్ర (కడప), వి.చరణ్ (పాడేరు), డి జాషువ (గుంటూరు), జి.లలిత్ (చిత్తూరు) గెలుపొందారు.

రేపు శ్రీవారి సహస్ర దీపాలంకరణ సేవ ప్రారంభం

- ఈనెల 16 నుంచి భక్తులకు అందుబాటులోకి
- ప్రతి శనివారం సాయంత్రం 7 గంటల నుంచి జరుగనున్న సేవ
- టికెట్ రుసుము దంపతులకు రూ.500

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో నూతనంగా సహస్ర దీపాలంకరణ సేవను ఈనెల 9న ప్రారంభించనున్నట్టు ఆలయ ఈఓ ఎస్‌వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. భక్తులకు ఈ సేవ 16 నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రతి శనివారం సాయంత్రం 7 గంటల నుంచి జరిగే ఈ సేవలో పాల్గొనదలచిన దంపతులు టికెట్ రుసుముగా రూ. 500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సహస్ర దీపాలంకరణ సేవకు శాశ్వత విరాళంగా రూ.5 వేలు చెల్లిస్తే, పదేళ్ల పాటు ప్రతి ఏడాది ఒక శనివారం నాడు ఈ సేవను జరిపించుకోవచ్చన్నారు. ఈ సేవలో పాల్గొనే భక్తులకు శ్రీవారి ప్రత్యేక దర్శనంతో పాటు, స్వామివారి శేష వస్త్రంగా కండువా, రవిక, పటికబెల్లం చిప్స్, పసుపు, కుంకుమలను అందిస్తామన్నారు. కావున పెద్ద ఎత్తున భక్తులు ఈ సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని తరలించాలని ఈఓ కోరారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సహస్ర దీపాలంకరణ సేవ మండపం



అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న అతిథులు, క్రీడాకారులు

పాలకొల్లు సెంట్రల్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అంతర్ కళాశాల మహిళా బ్యాడ్మింటన్ టోర్నమెంట్, యూనివర్సిటీ సెలెక్షన్స్ పోటీలు పాలకొల్లు దాసరి నారాయణరావు (డీఎన్నార్) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు రెండు రోజులు పాటు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు పాలకొల్లు, భీమవరం, తణుకు, కాకినాడ, రాజోలు, ఏలూరు, రాజమండ్రి, మండపేట ప్రాంతాల్లో 16 కళాశాలల నుంచి 60 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయాన్ని వాకర్స్ క్లబ్ సభ్యులు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నతానియేల్ హాజరుకాగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శోభారాణి, సీపీడీసీ సభ్యులు గాదె జనార్ధనగుప్త, సీహెచ్ బారిష్టర్, కొండ్రెడ్డి నారాయణరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్, పూర్వ విద్యార్థిని నాగలక్ష్మి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఎల్ రమేష్, సెలక్షన్ కమిటీ అబ్జర్వర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓ వృద్ధుడు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం వెలగల కృష్ణారెడ్డి (73) అతని భార్య గత 20 రోజులుగా అత్తిలి మండలం, యలమంచిలి గ్రామానికి చెందిన అల్లుడు మేడపాటి జోగిరెడ్డి ఇంటికి వచ్చి ఉంటున్నారు. ఈనెల 6న మందులు తీసుకువస్తానని చెప్పి వెళ్లిన కృష్ణారెడ్డి ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులు ఇంటి వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అల్లుడు జోగిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్సై ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌స్టేషన్ వద్ద నిరసన

ఆకివీడు: తమకు విద్యుత్ కనెక్షన్ కట్ చేశారని ఆందోళన వ్యక్తం చేస్తూ ఆకివీడు మండలంలోని ఐభీమవరం రోడ్డులోని ఆక్రమణదారులు గురువారం రాత్రి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బైఠాయించారు. ఆక్రమణల తొలగింపునకు మూడు రోజుల గడువు ఇచ్చిన అధికారులే తమను మోసం చేసి కరెంట్ కట్ చేశారని వాపోయారు. ఈమేరకు తహసీల్దార్, పోలీస్ స్టేషన్, నగర పంచాయతీ కార్యాలయంలో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగి సిబ్బందిని నిర్బంధించి నినాదాలు చేశారు. తమకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేంత వరకు సబ్‌స్టేషన్ వద్దే నిద్రపోతామని వారు హెచ్చరించారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీవీ వర్మ, సందక సూరిబాబు, బొద్దుపల్లి రాంబాబు, డోకల రవితేజ తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసనకు దిగిన ఐ భీమవరం రోడ్డు బాధితులు

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

నరసాపురం రూరల్: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు మొగల్తూరు ఎస్సై జి వాసు తెలిపారు. వివరాల ప్రకారం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన నల్లగంగుల దీపకు విజయవాడకు చెందిన నరేష్‌తో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. అయితే ఇటీవల అదనపు కట్నం తీసుకురావాలని భర్త తరచూ వేధించి ఇబ్బందులకు గురి చేస్తుండడంతో దీప పోలీసులకు ఫిర్యాదు చేసింది.

16 మద్యం సీసాలు స్వాధీనం

పెదపాడు: కలపర్రు గ్రామంలోని బెల్ట్‌షాపుపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ వైఎస్ఎస్ ఫణికుమార్, హెడ్ కానిస్టేబుల్ టీ కిశోర్ ఈ దాడుల్లో పాల్గొన్నారు.



మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న దృశ్యం

క్లుప్తంగా

ఫీవర్ సర్వేపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్

తణుకు అర్బన్: ఫీవర్ సర్వేపట్ల క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ ఎం.గులాబ్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. తణుకు ఎన్జీవో కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యసిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా గ్రామాల్లో జ్వరాల బాధితులను గుర్తించి వారికి సత్వర వైద్యసేవలందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని అన్నారు. జ్వరాలు అధికంగా వస్తున్న ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించేలా కార్యాచరణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కె.పృధ్వీరాజ్, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, ఫైలేరియా సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, వార్డు హెల్త్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

తణుకు టౌన్: ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకూ మంగుళూరు యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన విద్యార్థినీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీ సుందరిబాయి తెలిపారు. ఈనెల రాజమండ్రిలో జరిగిన క్రాస్ కంట్రీ మహిళా ఇంటర్ కాలేజీయేట్ కం యూనివర్సిటీ ఎంపిక పోటీలలో తమ కళాశాలకు చెందిన బీ నాగలక్ష్మీ అనే విద్యార్థినీ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన జట్టు మంగుళూరు యూనివర్సిటీలో జరిగే క్రాస్ కంట్రీ పోటీల్లో ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని నాగలక్ష్మీ దుర్గను, కళాశాల పీడీ ఎం రత్నకుమారిని కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, సిబ్బంది అభినందించారు.

9న ఉండిలో వ్యవసాయ కార్మిక సంఘ సమావేశం

పెంటపాడు: వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 9న ఉండి మార్కెట్ యార్డులో జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరుగుతుందని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కలిశెట్టి వెంకట్రావు, కళింగ లక్ష్మణరావులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

తణుకు: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెనుమంట్ర మండలం కె.ఇల్లిందలపర్రు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి గుబ్బల వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి అరెస్టు చేసి ఆయన వద్ద 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్ఐలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసినట్లు చెప్పారు. అనధికారికంగా బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

30 మంది యువకులపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం పట్టణంలో బుధవారం రాత్రి 10 గంటలు తర్వాత అనుమానస్పదంగా సంచరిస్తున్న 30మంది యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వారి నుంచి మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని గురువారం వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాత్రి సమయాల్లో అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బైటకు రావాలని సూచించారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

తణుకు అర్బన్: తణుకు జాతీయరహదారి సమీపంలోని శ్రీధర్మశాస్త్ర పంచాయతన అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వామి వేమూరి చలపతి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్వామి వారికి అత్యంత వైభవంగా పడిపూజ నిర్వహించారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామస్తులు జవ్వాది దుర్గారావు, సుజాత కుమారి దంపతుల సౌజన్యంతో నిర్వహించిన ఈ పడిపూజ కార్యక్రమంలో స్వామివారిని విశేషంగా అలకంరించారు. స్వామివారు అధిరోహించే మెట్ల అలంకరణను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. నిత్యపూజారి సత్యనారాయణ సమక్షంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం గురుస్వామి చక్రి ఆలపించిన అయ్యప్పస్వామి భక్తిగీతాలు అలరించాయి. పూజాధికాల అనంతరం 350 మంది స్వాములు అల్పాహారం స్వీకరించారు. మాలదారులు రాజ్‌కుమార్, ప్రసాద్, హనుమాన్, రమేష్‌వర్మ, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగు, పల్లారావు, గాదె నాని, వెంకట్, భక్తులు పాల్గొన్నారు.

అల్లేసినా..పట్టించుకోరా!

- గాలి వీచినా, వర్షం కురిసినా సరఫరాకు అంతరాయం
- ప్రతి శుక్రవారం ట్రీ కటింగ్ పేరిట కరంట్ నిలిపివేత
- పొదలను తొలగించని వైనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఎక్కడ చూసినా విద్యుత్ స్తంభాలకు పచ్చని పొదలు కింద నుంచి పై వరకూ ఆల్లేశాయి. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారు. నిర్వహణ పనుల పేరిట గంటల తరబడి విద్యుత్‌ను నిలిపివేస్తున్న చిన్నచిన్న సమ్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. స్తంబాలు కనిపించనంతగా పొదలు అల్లుకుపోవడం, తీగల మధ్యలోకి చొచ్చుకుపోయిన చెట్ల కొమ్మలు, తప్పు పట్టిన, వాలిన విద్యుత్ స్తంబాలు, రక్షణ లేని పరివర్తకాలు, లోవోల్టేజీ అనేక సమస్యలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వెంటాడుతున్నాయి. మహాలక్ష్మినగర్ రోడ్డు నెంబర్ 2, 3 మధ్య శివారు ప్రాంతాలలోను, సుబ్బారావుపేట ఏడోవ వార్డు స్కేటింగ్ పార్కు, వెంకట్ ఆస్పత్రి వద్ద, ఆనంద నిలయం ఫంక్షన్ హాల్ వద్ద, 5వ వార్డు కోదండ రామాలయం వద్ద, కోతిబొమ్మ సెంటర్‌లోను, ఇలా ఎక్కడ చూసిన పట్టణంలో అనేక ప్రాంతాలలో విద్యుత్ వైర్లుకు చెట్టు కొమ్మలు అడ్డుతగలడం, ట్రాన్స్‌ఫార్మర్‌లకు తీగలు అల్లుకోవడం జరుగుతుంది.

తీగల మధ్య చెట్ల కొమ్మలు

పట్టణంలో విద్యుత్తు నిర్వహణ పనులు సక్రమంగా చేయడం లేదు. పలుచోట్ల చెట్టు కొమ్మల మధ్య తీగలు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. మరో స్తంబానికి పొదలు ఎగబాకాయి. లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. నిర్వహణ పనుల పేరిట గంటల తరబడి సరఫరా నిలిపివే సే యంత్రాంగం వీటిని కనీసం పట్టించుకోకపోవడంతో వినియోగదారులకు వెతలు తప్పడం లేదు. వర్షాకాలంలో అయితే విద్యుత్ కొమ్మలకు తగిలిన చెట్లును పొరపాటున పట్టుకుంటే విద్యుత్ ఘాతం జరిగి చనిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌లో లోపాలు కారణంగా విద్యుత్ వినియోగదారులు తరుచుగా ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించేందుకు వీలుగా విద్యుత్ వైర్లు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించాలని ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ అల్లుకున్న మొక్కలు తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



11వ వార్డులో విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న తీగలు



మహాలక్ష్మినగర్‌లో కాలనీలో ఇలా...



సుబ్బారావుపేట స్కేటింగ్ పార్కు ప్రాంతాలలో చెట్ల కొమ్మల మధ్యలో విద్యుత్ లైన్‌లు



ఐదోవ వార్డు కోదండ రామాలయం వద్ద విద్యుత్ స్తంభాన్ని చుట్టేసిన పొదులు

వీధి దీపాల నిర్వహణ అంతంత మాత్రమే: పురపాలక సంఘానికి సంబంధించి ఏర్పాటు చేసిన వీధి దీపాలను (స్ట్రీట్ లైట్లు) వెలిగే విధంగా చూసుకునే బాధ్యత నిర్వహణ బాధ్యత పురపాలక సంఘం చూసుకోవాల్సి ఉండగా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో పలు ప్రాంతాలలో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయాలలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీధి లైట్లు వెలగని కారణంగా అనేక శివారు ప్రాంతాలలో ముఖ్యంగా ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్న ఏరియాలలోను విష జంతువులు, పాముల బెడద అధికంగా ఉండటంతో ఆయా ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. అన్ని వార్డులలోను అనేక ప్రాంతాలలో వీధి దీపాలు వెలగడం లేదు. తక్షణమే మునిసిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీధి లైట్లు వెలగడం లేదు



అనేక ప్రాంతాలలో ఎంతో కాలంగా స్ట్రీట్ లైట్లు వెలగడం లేదు. అనేక ప్రాంతాలలో తూడుతో పెరిగిపోయిన ఖాళీ స్థలాలు ఉన్నాయి. రాత్రి సమయాలలో పాములు, విష పురుగులు బెడద ఎక్కువగా ఉంది. ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగించే విధంగా చూడాలి -బి.వరహాలు, మహాలక్ష్మినగర్ శివారు

చెట్టు కొమ్మలను తొలగించండి



విద్యుత్ వైర్లుకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించాలి. విద్యుత్ వైర్లుకు కొమ్మలు అడ్డంగా ఉండటం కారణంగా అనేక సార్లు మంటలు చెలరేగుతున్నాయి. విద్యుత్ వైర్లు కట్ అవుతున్నాయి. రిపేర్లు చేయడానికి చాలా సమయం పడుతుంది. కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నాం

-అచ్యుత శ్రీనివాసరావు, 11వ వార్డు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): వన్ టౌన్‌లో విద్యుత్ 33/11కేవీ హౌసింగ్‌బోర్డు కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 8వ తేదీన విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. మెయిన్ రోడ్డు, రైల్వే ఫీడర్‌లకు సంబంధించి, నందిబొమ్మసెంటర్, శేషమహల్ రోడ్డు, నల్లజర్ల రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, కోతి బొమ్మ సెంటర్, వెంకటరత్నం ఆసుపత్రి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే టూ టౌన్‌లో 11కేవీ మార్కెట్ ఫీడర్‌కు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ వెల్లడించారు. భాగ్యలక్ష్మిపేట, సీతారాంపేట, కొత్తగూడెం, మెయిన్ రోడ్డు, స్థానిక ఏలూరు రోడ్డులలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు బియ్యం అందజేత



కొమ్ముగూడెం గ్రామంలో అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జీ) బియ్యం, దుస్తులు, వంట సామాగ్రిని అందజేశారు. మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, వాడపల్లి సుబ్బరాజు, రాజులపాటి సత్యరాజు, ఉప్పలపాటి భాస్కర్‌రావు, మార్లపూడి వెంకటేశ్వరరావు, జాస్తి సురేష్, జాన బాలాజీ, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరూపించలేని వ్యాఖ్యలు చేయడం అవివేకం

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్ సీపీలో వార్డు ఇన్‌చార్జిలుగా చెలామణి అయి లబ్ధిపొందిన అనంతరం ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో జనసేన పంచన చేరిన స్వార్థపరులు నిరూపించలేని వ్యాఖ్యలు చేయడం వారి అవివేకాన్ని తెలియజేస్తుందని గూడెం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు ఘాటుగా విమర్శించారు. మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం ట్రస్టీ మాజీ సభ్యురాలు బొద్దాని విజయలక్ష్మి మాట్లాడుతూ తాను డ్వాక్రా సొమ్ములను దాచుకున్నానని చెప్పిన మాజీ సైనిక ఉద్యోగి అంబటి కృష్ణ నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వార్డు ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో అతను చేసిన అవినీతికి తమ వద్ద ఆధారాలున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులపై విమర్శలు మానుకోవాలన్నారు. దండే చినగోతియ్య మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీలో చేరి తమ సొంత అవసరాలను తీర్చుకునే సింగం సుబ్బారావు జగన్నాథపురం గ్రామం గురించి మాట్లాడడటం శోచనీయమన్నారు. జగన్నాథపురం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్ అందించిన సేవలు తెలుసునన్నారు. ఈ కార్యక్రమంలో బొద్దాని శ్రీనువాసు, పోట్ల ఏడుకొండలు, గంటి సర్వేస్వరరావు, రాపాక అప్పన్న, ముర్లపూడి రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వీఏవోల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

తణుకు: గత ఎనిమిది నెలలుగా వీఏవోల బకాయి వేతనాలు వెంటనే కూటమి ప్రభుత్వం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో వీఏవోలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ వీఏవోలకు చెల్లించాల్సిన 8 నెలలు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో చేయమని అధికారులు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని కానీ ఫోన్లు పని చేయడం లేదన్నారు. వీఏవోల సమస్యలు వెంటనే పరిష్కారం దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపి, గార రంగారావు, రాజేశ్వరి, పార్వతి, లీలావతి, మహా లక్ష్మి, దీప్తి, దేవి, వెంకటరమణ, రత్నం, తదితరులు పాల్గొన్నారు.



తణుకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఏవోలు

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని, ఐదు కోళ్లు, రెండు కత్తులు, రూ.20,500లు నగదు స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ జేఎస్‌వీ.ప్రసాద్ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇసుక సమస్యను పరిష్కారం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపు మేరకు ఈ నెల 11వ తేదీన భీమవరంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని అరుణోదయ బిల్డింగ్ పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఆకుల రాంబాబు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో అసోసియేషన్ సమావేశం గురువారం యూనియన్ అధ్యక్షుడు యలమర్తి వీర్రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇసుక కొరత వల్ల గత 4 నెలలుగా బిల్డింగ్ నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. ఇసుక సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వంపై కార్మికుల ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఎలమర్తి వీర్రాజు, రవికుమార్, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలు

- ఫలితాలిస్తున్నాయంటున్న ఆర్టీసీ డ్రైవర్లు
- బస్సుల కండిషన్ మెరుగుపరచడం.. ప్రయాణికుల్లో నమ్మకం కోసం
- ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాల నిర్వహణ



తణుకు డిపోలో డ్రైవర్ల నుంచి వచ్చిన సమస్యల వివరాలను పరిశీలిస్తున్న డిపో మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: బస్సులు పూర్తి కండిషన్‌తో ఉంటేనే ప్రయాణికులు క్షేమంగా ఇంటికి చేరే పరిస్థితి ఉంటుంది. కండిషన్‌లో లేని బస్సులు ఎక్కాలంటే ప్రయాణికులు భయపడే పరిస్థితి ఉంది. ఈ సమస్యను అధిగమించడంతోపాటు డ్రైవర్ల సూచనల మేరకు బస్సులను పూర్తి కండిషన్‌తో ఉంచేందుకు ఆర్టీసీ ప్రత్యేక కార్యాచరణ చేసింది. ఇందులో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు డ్రైవర్ల సంతోష వారోత్సవాలను నిర్వహించింది ఆర్టీసీ సంస్థ. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ బస్సు డిపోకి రాగానే డ్రైవర్ బస్సులో ఉన్న సమస్యలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బుక్‌లో రాయాల్సి ఉంటుంది. ఆ బుక్‌లో డ్రైవర్లు రాసిన సమస్యలను గ్యారేజ్ సిబ్బంది పరిష్కరించాల్సి ఉంది. ఆ తరువాత బస్సులో ఉన్న సమస్యలకు సంబంధించిన మెకానిక్స్, ఎలక్ట్రీషియన్స్‌తోపాటు అధికారులు బస్సులో సుమారుగా 5 కిలోమీటర్ల మేర ప్రయాణించి పరిశీలించాల్సి ఉంది. తణుకు ఆర్టీసీ డిపోకు సంబంధించి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌లగ్జరీ, ఇంద్ర, నైట్‌రైడర్స్‌తో కలిపి మొత్తం 79 బస్సులు అందుబాటులో ఉండగా 105 మంది డ్రైవర్లు అందుబాటులో ఉన్నారు.

ప్రయాణికుల క్షేమం కోసం..

విధి నిర్వహణలో డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడిపితే చాలదు ఆ బస్సులు కూడా పూర్తి ఆరోగ్యంగా ఉండాల్సిన అవసరం ఉంది. డ్రైవర్ ఏకాగ్రత తప్పినా, బస్సులు అనారోగ్య సమస్యలతో నిండిపోయానా జరిగే నష్టం ప్రయాణికులకే అనే విషయం అందిరికీ తెలిసిందే. ఈ విషయాన్ని గ్రహించిన ఆర్టీసీ అధికారులు డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలు పేరుతో బస్సుల్లో ఉన్న సమస్యలను సరిదిద్దేందుకు తెరతీశారు. సమస్యలు పరిష్కారానికి డ్రైవర్లు, గ్యారేజ్‌లోని మెకానిక్‌లను భాగస్వామ్యం చేస్తూ బస్సుల్లో తలెత్తిన సమస్యలను తొలగించేందుకు ఏర్పాటుచేసిన మంచి కార్యక్రమమే డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలు అని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇకపై ప్రతినెలా ఈ వారోత్సవాలను నిర్వహించే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

బస్సుల కండిషన్‌పై నమ్మకం కలిగించేలా



ఆర్టీసీ బస్సుల కండిషన్‌పట్ల ప్రయాణికుల్లో నమ్మకం కలిగించడంతోపాటు ప్రతి బస్సును కండిషన్‌లో ఉంచడం కోసం ఆర్టీసీ సంస్థ డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలను ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాం. ఈ కార్యక్రమం మొదలుపెట్టిన రోజు నుంచి మంచి ఫలితాలు వస్తున్నాయి. బస్సుల్లో ఉన్న సమస్యలను డ్రైవర్ల సూచన మేరకు మెకానిక్స్, ఎలక్ట్రీషియన్స్ పరిష్కరిస్తున్నారు. ఆ తర్వాత మేము రోడ్ టెస్ట్ కార్యక్రమంలో భాగంగా బస్సు ఎక్కి ప్రయాణం చేసి సమస్య పరిష్కారం అయ్యిందో లేదో నేరుగా పరిశీలిస్తున్నాము – సప్పా గిరిధర్‌కుమార్, తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు

బస్సుల్లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయి



డ్రైవర్ల సంతోషకర వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ బస్సులో ఉన్న సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయి. విధి నిర్వహణ అనంతరం డ్యూటీ దిగే సమయంలో డిపోలో ఉన్న బుక్‌లో బస్సులో ఉన్న సమస్యలు రాస్తున్నాం. వెంటనే సంబంధిత మెకానిక్స్ సమస్యను పరిష్కరిస్తున్నారు. ఆ సమస్య పరిష్కారం అయ్యిందా లేదా అనే విషయాన్ని పరిశీలించేందుకు రోడ్ టెస్ట్‌కు స్వయంగా డిపో మేనేజరు, సూపర్‌వైజర్, సంబంధిత మెకానిక్స్ వెళ్తున్నారు. ప్రయాణికులకు కూడా బస్సులపై నమ్మకం కలుగుతుంది. – కోరాడ దుర్గాప్రసాద్, ఆర్టీసీ బస్సు డ్రైవర్

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



క్యాన్సర్ అవగాహన శిబిరంలో డైమండ్స్ సభ్యులు



మాధవరం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్యాన్సర్ వ్యాధి పట్ల విద్యార్థులు చిన్ననాటి నుంచి అవగాహన కలిగి ఉండాలని పేరిచర్ల మురళీకృష్ణంరాజు పేర్కొన్నారు. డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ మైథిలి, డాక్టర్ కమలలు మాట్లాడారు. క్యాన్సర్ పట్ల జాగ్రత్తలు, చికిత్స మార్గాలు, తొలి దశలోనే గుర్తించడం తదితర విషయాలను ప్రస్తావించారు. భారత్‌లో ప్రతి రోజు 1300 మంది క్యాన్సర్ భారీనపడి మరణిస్తున్నట్లు చెప్పారు. కేవీ బాబు సహకారంతో విద్యార్థినులకు క్యాన్సర్ రహిత శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు చెన్నారెడ్డి సతీష్, మానేపల్లి సునీల్, ఆకుల సతీష్, కాళ్ళ గోపి, నార్ని వెంకట్ కృష్ణారావు, ఎం.రాము, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ప్రాణాంతకం

తాడేపల్లిగూడెం రూరల్: క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకమని, ముందుగా గుర్తించడం ద్వారా నియంత్రణ సాధ్యమని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీ. వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామంలో క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రధానంగా క్యాన్సర్ మహిళల్లో అత్యధికంగా సంక్రమిస్తుందని, మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఇదిలా ఉంటే క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రతి ఇంటికి ఎంఎల్‌హెచ్‌పీలను, ఏఎన్‌ఎంలకు, ఆశాలు సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వరరావు, హెచ్‌వీ సీహెచ్‌వీఎస్.మణి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకరిపై బైండోవర్ కేసు నమోదు

అత్తిలి: ప్రభుత్వం ద్వారా సరఫరా చేసే చౌకబియ్యాన్ని గతంలో కొనుగోలు చేసిన యర్రి గౌరీ శంకర్‌పై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ దశివక వంశీ తెలిపారు. గౌరీశంకర్‌ను తహసీల్దార్ కోర్టులో హాజరు పర్చగా అతని వద్ద నుంచి బైండోవర్ పత్రాలను స్వీకరించారు.